క్లుప్తంగా

పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా



నాయకులతో సమావేశమైన తహసీల్దార్ యుగేశ్వరిదేవి

బత్తలపల్లి: ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నామని తహసీల్దార్ యుగేశ్వరిదేవి వివరించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె అఖిల పక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల పాటు బీఎల్‌ఓలు ఇంటింటా సర్వే చేపట్టారన్నారు. ఇది వంద శాతం పూర్తయిందన్నారు. ఆన్‌లైన్‌లో 60 శాతం అప్‌లోడ్ చేశామని తెలిపారు. మార్పులు–చేర్పుల అంశాలపై అఖిల పక్ష నేతలతో చర్చించి సరి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, సర్పంచు ప్రభాకర్, బీజేపీ మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప, సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కమతం కాటమయ్య, మండల కార్యదర్శి బండల వెంకటేష్, సహాయ కార్యదర్శులు మాల్యవంతం కుళ్లాయప్ప, గుండాల ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే ప్రజా మద్దతు



సర్పంచు, వార్డు మెంబర్‌కు అభినందనలు తెలుపుతున్న ఎంపీపీ

బత్తలపల్లి: ఎన్నికలు ఏవైనా ప్రజా మద్దతు వైఎస్సార్‌సీపీకేనని ప్రజలు నిరూపిస్తున్నారని ఎంపీపీ బగ్గిరి త్రివేణి అన్నారు. మండలంలోని తంబాపురం గ్రామ పంచాయతీలోని 3వ వార్డు మెంబర్‌గా బ్యాల్ల లక్ష్మీనారాయణమ్మ గెలుపొందడంతో మంగళవారం గ్రామానికి చేరుకుని అభినందించారు. తంబాపురం సర్పంచు సానే జయచంద్రారెడ్డి, వార్డు మెంబర్ బ్యాల్ల లక్ష్మీనారాయణమ్మకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగనన్న సంక్షేమానికి బాటలు వేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నేతలు సానే వీరారెడ్డి, లింగమయ్య, వాల్మీకి ఓబిలేసు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

పుట్టపర్తి టౌన్: సీపీఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న నిర్వహిస్తున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి పట్టణంలో సాయిఆరామంలో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను విరమించుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టును ప్రతిపాదిత ఎత్తులో నిర్మించాలన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై జరిగే బస్సు యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమణ, మహిళా సంఘం కార్యదర్శి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: మండల కేంద్రానికి చెందిన ఫిరోజ్‌ఖాన్ ఐదు రోజుల క్రితం ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కదిరిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చేతుల మీదుగా రూ.8 లక్షలు (2లక్షల నగదు, 6 లక్షల విలువ చేసే చెక్కు) ఆర్థిక సాయం అందించారు. అన్నివిధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటెరాము, షామీర్‌బాషా, అమీర్‌బాషా, మహమ్మద్ హనీఫ్ తదితరులు ఉన్నారు.

ప్రజాసేవే పరమావధిగా పాలన

• ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

గాండ్లపెంట: ప్రజాసేవే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కటారుపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. ముందుగా స్థానిక ప్రజా కవి యోగి వేమన విగ్రహానికి పూలమాల వేసి సమాధి వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సచివాలయం ఎదుట మొక్కలు నాటి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను గమనించి గ్రామాల్లోనే అన్ని సేవలు అందించేలా సచివాలయాలను నిర్మించి 1.6 లక్షల మంది నిరుద్యోగులకు సీఎం జగన్ ఉద్యోగాలు కల్పించారన్నారు. వలంటీర్లను నియమించి ప్రజల ఇంటి వద్దకే సేవలు అందిస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ వారు కళ్లులేని కబోదుల్లా విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల కోసం తపన పడే సీఎం మరో 30 సంవత్సరాలు పాలన చేసేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కాంట్రాక్టర్లు హరిప్రసాద్‌రెడ్డి, అంజనేయులురెడ్డి, మేస్త్రీని, కటారుపల్లి సర్పంచ్, మద్దివారిగొంది గ్రామ సర్పంచ్ నాగభూషణంరెడ్డిని ఎమ్మెల్యే పూలమాలలు వేసి దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హమీద్‌బాషా, అమీర్‌బాషా, సర్పంచ్ గంగోజమ్మ, ఉప సర్పంచ్ సైదు, వైఎస్సార్‌సీపీ నాయకులు క్రిష్టారెడ్డి, ఉత్తన్న, వేమయ్య, ఎంపీపీ తాతం జగన్మోహన్, పార్టీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, బీసీ కన్వీనర్ నరసింహా గౌడ్, సొసైటీ అధ్యక్షుడు ఎస్పీ హైదర్‌వలీ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీంద్రానాయక్, ఆర్బీకే చైర్మన్ శంకర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామి రెడ్డి

• ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 11వవార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. వార్డులో ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో డ్రైనేజీ కాలువలను సరిగ్గా శుభ్రం చేయలేదని పలువురు ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎప్పటికప్పుడు కాలువలు, రహదారులు శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇంటిపట్టా వచ్చినా బిల్లులు పడలేదని పలువురు జగనన్న కాలనీల లబ్ధిదారులు తెలపగా.. వెంటనే హౌసింగ్ ఏఈతో మాట్లాడి బిల్లులు త్వరితగతిన పడేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఏ చిన్న సమస్య కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు వారి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన చేస్తున్నారని, వాటిని క్షేత్రస్థాయిలో అర్హులైన నిరుపేదలకు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ అత్తర్ జిలాన్‌బాషా, వార్డు సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, నాయకులు కాచర్ల అంజి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మకు ఎమ్మెల్యే పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: మండలంలోని కోడేకండ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి మంగళవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం (శ్రీవాణి ట్రస్టు) వారి రూ.10 లక్షల ఆర్థిక సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఆలయం నిర్మించారు. విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు మూడు రోజులుగా వేద పండితులు మంజునాథశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మంగళవారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెద్దమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి వీరనారప్ప, శంకర్, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, బ్యాళ్ల పెద్దయ్య, దేవరప్ప, ఆర్వేటి సోమశేఖర్‌తో పాటు పలువురు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మృతదేహానికి నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

నల్లమాడ: మండలంలోని నల్లసింగయ్యగారిపల్లికి చెందిన బోడెద్దుల గంగాద్రి కుమారుడు బీ. విజయ్‌కుమార్ (32) గుండెపోటుతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మృతుని ఇంటి వద్దకు వెళ్లి విజయ్‌కుమార్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు. తనవంతు ఆర్థికసాయం అందించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, మాజీ ఎంపీపీ అగిశం ప్రతాప్, మండల పార్టీ పరిశీలకులు కేశప్ప, నాగమల్లారెడ్డి, స్థానిక నాయకులు చెన్నక్రిష్టారెడ్డి, రామకృష్టారెడ్డి, హరినాథరెడ్డి, రాజు, శివారెడ్డి తదితరులున్నారు.

పరామర్శ

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం క్రిష్టాపురంలో ఇటీవల గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీటీసీ కేశవనాయుడు, పీర్ల పండుగ రోజు ప్రమాదవశాత్తు కాలికి తీవ్ర గాయాలైన ఇదే గ్రామానికి చెందిన సాయినాథ్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అధికారులు తీరు మార్చుకోవాలి

• మండల మీట్‌ను వాకౌట్ చేసిన ఎంపీటీసీలు



అధికారులపై మండిపడుతున్న ప్రజాప్రతినిధులు

అమడగూరు: అధికారులు తమ తీరు మార్చుకోవాలని మండల ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహణకు అధికారులు సిద్ధం చేశారు. 8 మంది ఎంపీటీసీలు మండల పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చినా అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. అనంతరం ఎంపీటీసీలు పలువురు సర్పంచులతో కలసి ఎంపీడీఓ మునెప్ప, తహసీల్దార్ వెంకటరెడ్డితో మాట్లాడారు. అధికారులు హాజరు కాకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. ఎలక్ట్రికల్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరు బాలేదన్నారు. గ్రామాల్లో విద్యుత్ లైన్లు మార్చాలని చెప్పినా ప్రయోజనం లేదని మండిపడ్డారు. లంచం ఇస్తేనే హౌసింగ్ అధికారులు పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 5 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లను వారి పదవిలోకి మరొకరు రాకుండానే ఎలా రిలీవ్ చేశారని దుయ్యబట్టారు. హౌసింగ్ బిల్లులు ఆన్‌లైన్ చేయడానికి సిబ్బంది లేక మండలంలో ప్రజలంతా అగచాట్లు పడుతున్నారన్నారు. అధికారుల తీరు మారకుంటే మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఎంపీటీసీలు హాజరు కానందున ఎంపీడీఓ మండల మీట్‌ను ఈ నెల 26కు వాయిదా వేశారు.

పంటలకు రక్షక తడులు



ట్యాంకర్ల ద్వారా ఆముదం పంటకు రక్షక తడులు అందిస్తున్న ఎకాలజీ సిబ్బంది

ధర్మవరం రూరల్: ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో డైరెక్టర్ మల్లారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని వర్షాధార పంటలకు రక్షక తడులను అందించినట్లు ఎంటీఎల్ దస్తగిరి తెలిపారు. మంగళవారం గొట్లూరు, ఆకుతోటపల్లి గ్రామాలలో ట్యాంకర్ల ద్వారా ఆముదం, కంది పంటలకు రక్షక తడులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎస్ఎంజీ గ్రూపులలోని రైతులు వర్షాధారం కింద సాగుచేసిన పంటలు ఎండు ముఖం పడుతుండడంతో రక్షించేందుకు తడులను అందిస్తున్నామన్నారు. ధర్మపురి, ఎస్ఆర్‌కే కొట్టాల, ఎర్రగుంటపల్లి, మాలగుండ్లపల్లి, రావులచెరువు, ముచ్చురామి, సీతారాంపల్లి, గరుడంపల్లి, తిప్పేపల్లి, గొట్లూరు, ఆకుతోటపల్లి గ్రామాలను కలిపి ఇప్పటి వరకు 146 ఎకరాలకు ఆముదం, కంది పంటలకు రక్షక తడులను అందించామన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎకాలజీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

27న ఉచిత మెగా వైద్య శిబిరం



పోస్టర్లు విడుదల చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్యవైశ్య కొత్తసత్రంలో ఈనెల 27వతేదీ నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన గుప్త, క్యాంపు చైర్మన్ నరేంద్రరెడ్డి, ప్రసన్నకుమార్ తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో మంగళవారం వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీక్లబ్, ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు మనోహర్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటా సర్వే



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కతిజున్‌కుబ్రా

ధర్మవరం అర్బన్: ఇంటింటా ఓటర్ల సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నామని డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కతిజున్‌కుబ్రా, తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్‌లు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులతో ఇంటింటా ఓటర్ల సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటా ఓటర్ల సర్వేలో నియోజకవర్గ వ్యాప్తంగా 287 మంది బూత్ లెవెల్ అధికారులు జులై 21 నుంచి ఆగస్టు 21వతేదీ వరకూ ఇంటింటికీ తిరిగి ఫిజికల్ వెరిఫికేషన్ పూర్తి చేశారన్నారు. బీఎల్‌ఓ యాప్‌లో సర్వర్ సమస్య ఉండటంతో సోమవారం వరకు 82శాతం పూర్తి చేశామని తెలిపారు. 2,416 చేర్పులకు, 5,445 తొలగింపులు, 3,014 సవరణలకు దరఖాస్తులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు వినోద్‌కుమార్

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ప్యాదిండిలో వినోద్‌కుమార్ (30) ఉరివేసుకొని సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్ఐ శ్రీధర్ తెలిపిన మేరకు ప్యాదిండికి చెందిన వినోద్ కుమార్ కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి భార్యాపిల్లలు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉదయం గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య కమలమ్మ, నలుగురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఉబిచెర్లలో గ్రామసభ

నల్లచెరువు: మండల పరిధిలోని ఉబిచర్ల గ్రామంలో జరగనున్న 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష' రీ సర్వే కార్యక్రమంలో భాగంగా మంగళవారం తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ఉపయోగాలను రైతులకు వివరించారు. అధికారులకు రైతులు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమణ బాబు, ఆర్ఐ అశోక్, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



ఆర్ఐ శ్రీశైలం రెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీ మాధవ రెడ్డి

పుట్టపర్తి టౌన్: అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఎస్పీ కార్యాలయంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో హోం గార్డ్స్ ఆర్ఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీశైలంరెడ్డి వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎస్పీ తన కార్యాలయంలో పూలమాల, శాలువతో ఆయనను సన్మానించారు. మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమన్నారు. ఎక్కడికి వెళ్లినా బాగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, దిశ డీఎస్పీ వరప్రసాద్, ఆర్ఐలు టైటాస్, నారాయణ, డీసీఆర్‌బీ సీఐ సుబ్బారావ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రారంభోత్సవాలు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీమహాలక్ష్మీ దేవాలయం, శ్రీపద్మావతి–శ్రీనివాస కళ్యాణ మండపం ప్రారంభోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త పూజారి మంజుల రమణయ్య తెలిపారు. 23న మహాగణపతి పూజ, స్వస్తిపుణ్యాహవాచనము, పంచగవ్యపూజ, కలశస్థాపన అభిషేకాలు, మహాగణపతి హోమం, రాక్షోఘ్న హోమం, శ్రీ నవగ్రహ హోమం, వాస్తు హోమాలు నిర్వహిస్తున్నామన్నారు. 24న ప్రాతఃకాల పూజలు, చండీయాగం, రుద్రహోమం, 25న గోపుర కలశ ప్రతిష్ట, శ్రీమహాలక్ష్మీ హోమం, సుదర్శన హోమం, పద్మావతి, శ్రీనివాస కళ్యాణం జరుగుతుందన్నారు. మహాపూర్ణాహుతి, గోపుర కలశకుంభాభిషేకం అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం శ్రీమహాలక్ష్మీ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యూవల్స్

కదిరి అర్బన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2022–23 విద్యా సంవత్సరంలో పనిచేసిన కాంట్రాక్ట్ లెక్చరర్లకు బుధవారం రెన్యూవల్స్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్టీఎస్ఎన్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 5 సంవత్సరాలు ఒకే కళాశాలలో సర్వీస్ పూర్తి చేసినవారు, ఇటీవల ప్రభుత్వ అధ్యాపకుల సాధారణ బదిలీలో డిస్టర్బ్ అయిన కాంట్రాక్ట్ అధ్యాపకులు సంబంధిత ఆధార్ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. తమ కళాశాలలో ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తి కానివారికి హాజరు నుంచి మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

కదిరి టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఏఐటీయూసీ (సీపీఐ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు ఇసాక్ మాట్లాడుతూ సోమవారం చలో విజయవాడకు వెళ్తున్న మున్సిపల్ కార్మికులను రైల్వేస్టేషన్‌లో అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర చౌదరి, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జనార్దన్, తిరుపాల్, బాలకృష్ణ, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

తలుపుల: సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం మంగళవారం స్థానిక ఎంఆర్‌సీ భవన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎంటీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు, మెసెంజర్లు ప్రభుత్వాన్ని కోరారు.

ఆలయ నిర్మాణానికి ముందుకు రావాలి

ధర్మవరం అర్బన్: త్యాగరాజ ధన్వంత్రి ఆలయం నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ధర్మవరం నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు కోరారు. స్థానిక ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నాయీబ్రాహ్మణులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లక్ష్మీచెన్నకేశవపురంలో త్యాగరాజ ధన్వంత్రి దేవాలయం నిర్మాణం కోసం ప్రతి నాయీబ్రాహ్మణుడు ముందుకు వచ్చి సహకారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు రాంప్రసాద్, శ్రీనివాసులు, సంజీవయ్య, లింగమయ్య, రాము, రాంప్రసాద్, ముత్యాలప్ప, సాయిప్రసాద్, రామకృష్ణ, ఎల్లప్ప, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మేపర్తికి చేరిన సచ్చిదానందస్వామీజీ

రాప్తాడు: దత్తాత్రేయ స్వరూపులుగా పూజలు అందుకుంటున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ రాప్తాడు మండలంలోని బొమ్మేపర్తి (జయలక్ష్మీ పురం) గణపతి సచ్చిదానంద ఆశ్రమానికి మంగళవారం చేరుకున్నారు. మైసూరు దత్తపీఠం నుంచి ఆశ్రమానికి వచ్చిన స్వామీజీకి.. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గండ్లూరి ట్రస్టు, సచ్చిదానంద ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను స్వామీజీ పర్యవేక్షించనున్నారు. జయలక్ష్మీ మాతాజీ, అన్నపూర్ణేశ్వరి విగ్రహ ప్రతిష్టల కోసం ట్రస్టు సభ్యులకు పలు సూచనలు చేశారు. మహిళలు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. స్వామీజీ చేతుల మీదుగా భక్తులు తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

తలుపుల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు మంగళవారం ప్రిన్సిపాల్ మహమ్మద్ తెలిపారు. కాంట్రాక్ట్ కింద తీసుకోనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 28న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

విద్యా ప్రణాళికల్లోనూ క్రీడలకు ప్రాధాన్యత

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం విద్యా ప్రణాళిక (కర్రికులమ్)లో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ/వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ పాలక భవనంలోని కాన్ఫరెన్స్ హాలులో 14వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ అధ్యత వహించి, మాట్లాడారు. 2023–24 విద్యా సంవత్సరంలో నిర్వహించాల్సిన క్రీడలపై వివరించారు. ఆలిండియా, సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పోటీల్లో అత్యధికంగా పతకాలు సాధించే విద్యార్థులు, కోచ్‌లకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. బీటెక్ మొదటి సంవత్సరంలో స్పోర్ట్స్ పీరియడ్‌ను కచ్చితంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.